
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ సంపుటి : 3, సంచిక : 310 | ఆదివారం నవంబర్ 16, 2025 | పేజీలు : 6 వెల : రూ.3-00



వేగమే ప్రమాదాలకు ప్రధాన కారణం..!

4లో..

- ప్రజల పక్షాన నిలబడటం ముఖ్యం
- హరీష్ పార్టీలో ఉండగానే ద్రోహం చేశారని ఆరోపణ
- బీఆర్ఎస్ ఓటమికి బాధ్యత తప్పించుకోవడంపైనే ఆయన దృష్టి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శలు

# జనం వజ్రాయుధం 'జాగృతి'



**వేద న్యూస్, డెస్క్:**

జాగృతి సంస్థ ప్రశ్నించే శక్తిగా.. ప్రజల వజ్రాయుధంగా మారుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జనం బాటలో భాగంగా మెదక్ జిల్లాలో పర్యటిస్తున్నట్టు శనివారం ఆమె పేర్కొన్నారు. మెదక్‌లో జరిగిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఆరేళ్లు జాగృతి సంస్థను నడిపాననీ, 20 ఏళ్లు బీఆర్ఎస్ కోసం పనిచేశాననీ చెప్పారు. పార్టీ పెట్టటం కన్నా కూడా ప్రజల పక్షాన నిలబడటం ముఖ్యం అని వెల్లడించారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాన్ని మనం చూశామనీ, ఎక్కడ చూసిన కాంగ్రెస్ పై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా.. కాంగ్రెస్ ఎందుకు గెలిచింది?అంటే.. అనుకున్న స్థాయిలో ప్రతిపక్షం బీఆర్ఎస్ పనిచేయటం లేదనీ స్పష్టం చేశారు.మాజీ మంత్రి హరీశ్‌రావుపై జాగృతి కవిత మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు.

**- మోసమే హరీష్ నైజం**

హరీశ్‌రావు నైజమే మోసమని, పార్టీలో ఉండగానే ద్రోహపూరిత చర్యలకు పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ ఓటమికి తాను కారణం కాదని చెప్పడం హరీశ్‌రావుకు అలవాటు అని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికను ప్రస్తావిస్తూ, ఇండిపెండెంట్ అభ్యర్థుల మద్దతు విషయానికి తాను స్పందించలేదని స్పష్టం చేసినప్పటికీ, వారంతా హరీశ్‌రావును కలిసి 'మీ ఇష్టం' అనే సమాధానమే పొందారని కవిత ఆరోపించారు. కీలక నాయకుడిగా ఉన్న హరీశ్‌రావు ఎన్నికల సందర్భంలో ఇలా వ్యవహరించడం మోసం చేయడమేనని ఆమె విమర్శించారు. అదేవిధంగా, కేటీఆర్ హరీశ్‌రావులను "పేరుకే కృష్ణార్జునులు"గా చిత్రిస్తూ, సోషల్ మీడియా ట్వీట్లు మాత్రమే చేస్తున్నారనీ కానీ, క్షేత్రస్థాయిలో పని చేయడం లేదని కవిత ఆక్షేపించారు.

**- గులాబీ నేతలు వ్యక్తిగత ఆస్తులు పెంచుకున్నారు**

బీఆర్ఎస్ నేతలు తమ వ్యక్తిగత ఆస్తులు పెంచుకున్నప్పటికీ, పార్టీ క్యాడర్‌ను పెంచలేకపోయారని ఆమె తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. జగదీశ్ రెడ్డి, మదన్ రెడ్డి, నిరంజన్ రెడ్డి వంటి నేతలకు వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో ప్రశ్నించిన కవిత, గతంలో కేసీఆర్‌ను విమర్శించి పార్టీని వీడిన పద్మా దేవేందర్ రెడ్డికి ఇప్పుడు హరీశ్‌రావు ఎందుకు మద్దతిస్తున్నాడని నిలదీశారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రూప్-1 ఉద్యోగాల విషయంలో విఫలమైందని, యువతకు అన్యాయం జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. హరీశ్‌రావు బినామీలు, వారి కంపెనీలు ముఖ్యమంత్రితో సంబంధాలు కలిగి ఉన్నారని కూడా కవిత సంచలన ఆరోపణలు చేశారు. "ఫైట్ ఉంటే నా లాగ స్ట్రెట్ ఫైట్ ఉండాలి.. మోసపూరితంగా ఉండొద్దు" అని అన్నారు. కేటీఆర్ అన్న సోషల్ మీడియాను వదిలి ప్రజల్లోకి రావాలనీ కోరారు. కేసీఆర్ చాలా ఆరోగ్యంగా ఉన్నారనీ, ఆయన బయటకు వస్తే పరిస్థితి వేరే ఉంటదనీ తెలిపారు.మెదక్ జిల్లా అంటే నెక్స్ట్ న్యూయార్క్ అనుకున్నానని,ఇక్కడ పరిస్థితి చూస్తే ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారనీ వెల్లడించారు. మహానాయకులు ఉన్న చోట ఇలాగే ఉంటుందని ఇప్పుడే జ్ఞానోదయం అయ్యిందనీ విమర్శించారు. కేసీఆర్ కళ్లకు గంతలు కట్టి బీఆర్ఎస్‌ను అధోగతి పాలు చేశారనీ ఆరోపించారు.

---



## "అరణ్యకము" పుస్తక ఆవిష్కరణ

**- ప్రకృతి పరిరక్షణపై పిలుపునిచ్చిన మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ సచివాలయంలో అడవుల ప్రాధాన్యతను, పర్యావరణ పరిరక్షణను ప్రతిబింబించే "అరణ్యకము" పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండ సురేఖ స్పందించారు. ప్రకృతిని సంరక్షించడం ప్రభుత్వం మాత్రమే కాక, ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. అడవులు మన జీవావరణానికి పునాది అని, వాటిని కాపాడడం భవిష్యత్ తరాల కోసం కీలకమని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పలు అధికారులు, రచయితలు, పర్యావరణ అభిమానులు పాల్గొన్నారు. పుస్తక రచయిత శ్రీ కృష్ణరావు రచించిన "అరణ్యకము" అడవుల గొప్పతనం, పర్యావరణ శాస్త్రం, జాతి పరిరక్షణ ప్రాముఖ్యతపై సమగ్ర సమాచారాన్ని అందిస్తున్నదని మంత్రి సురేఖ ప్రశంసించారు.

మిగతా 3వ పేజీలో..

## రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- జూబ్లీహిల్స్ విజయంతో తెలంగాణ కాంగ్రెస్‌లో నూతన ఊపు
- ఉప ఎన్నిక విజయం నేపథ్యంలో ఢిల్లీలో రాజకీయాలపై కీలక చర్చ
- భట్టి, మహేశ్ గౌడ్, నవీన్ యాదవ్ హాజరువుతో సమావేశానికి మరింత ప్రాధాన్యం
- స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పెంచిన వేగం



**వేద న్యూస్, డెస్క్:**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ధీటైన విజయం సాధించిన మరుసటి రోజే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమవడం రాజకీయ వర్గాల్లో విశేష ఆసక్తిని రేకెత్తించింది. జూబ్లీహిల్స్ వంటి పట్టణ ప్రాధాన్యం ఉన్న నియోజకవర్గంలో సుదీర్ఘ కాలం తర్వాత కాంగ్రెస్ విజయం సాధించడం పార్టీలో కొత్త నమ్మకాన్ని తీసుకొచ్చింది. ఈ విజయాన్ని సమీక్షించడానికి మాత్రమే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై

మిగతా 3వ పేజీలో..

## సీపీ సజ్జనార్ పేరుతో ఫేక్ అకౌంట్ మోసం

**- ఐపీఎస్ అధికారి పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించిన మోసగాళ్లు**

**వేద న్యూస్, హైదరాబాద్ :**



సైబర్ నేరగాళ్లు ఇప్పుడు సామాన్యులనే కాదు, ఉన్నతాధికారులను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారు. హైదరాబాద్ సీపీ, సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించి, ఆయన స్నేహితుల్ని మోసం చేసిన ఘటన వెలుగు చూసింది. సజ్జనార్ పేరుతో పంపిన సందేశాలను నమ్మిన ఆయన స్నేహితుడు సైబర్ మోసగాళ్లకు రూ.20,000 పంపించడంతో ఈ విషయం మరింత సంచలనంగా మారింది. ఈ మోసంపై సజ్జనార్ స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరిక జారీ చేశారు. సజ్జనార్ వివరాల ప్రకారం, తన పేరుతో నకిలీ ఖాతాను తమ స్నేహితులకు

మిగతా 3వ పేజీలో..

## కార్యకర్తల భద్రత బీఆర్ఎస్ బాధ్యత

**వేద న్యూస్, హైదరాబాద్ :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ కార్యకర్త రాకేష్ క్రిస్టోఫర్‌పై జరిగిన దాడి ఉద్రిక్తతలకు దారితీసింది. కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడిన రాకేష్‌ను శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. దాడిని తీవ్రంగా ఖండించిన ఆయన, ప్రజాస్వామ్య విలు వలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రవర్తిస్తోంది అని విమర్శించారు. దాడి ఘటనపై స్పందించిన కేటీఆర్, "జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు వచ్చి 24 గంటలు కూడా గడవలేదు, అప్పటికే కాంగ్రెస్ గూండాయిజానికి దిగజారింది" అని విమర్శిం చారు. తాము పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ ఏ ఉపఎన్నికలోనూ ఇలాంటి దాడులకు ఆస్కారం ఇవ్వలేదని గుర్తుచేశారు. "కాంగ్రెస్ చేస్తున్న రౌడీయిజాన్ని తెలంగాణ ప్రజలందరూ గమనిస్తున్నారు" అని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మా కార్యకర్తల భద్రత బీఆర్ఎస్‌కు అత్యంత ప్రాధాన్యం అని కేటీఆర్ స్పష్టం చేశారు. రాకేష్‌పై జరిగిన దాడికి కాంగ్రెస్ పూర్తిగా బాధ్యత వహించాలన్నారు. "దొంగ ఓట్లు వేయించి, డబ్బులు పంచి, గూండాగిరితో ఎన్నిక గెలిచింది కాంగ్రెస్" అని ఆయన విమర్శించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ, "ఎవరిది అహంకా రమో వారి విజయోత్సవ ర్యాలీనే చెబుతోంది" అని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఘటనపై మంగళవారం స్థానిక నేతలు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ గూండాయిజం ఆగకపోతే ప్రజలే సముచిత బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.



వేద న్యూస్

ఆదివారం నవంబర్ 16, 2025

# నేటి నుంచి యూజీ కాంటాక్ట్ క్లాసెస్ ప్రారంభం

**వేద న్యూస్, జమ్మికుంట:**




నేటి (ఆదివారం) నుంచి యూజీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం యూజీ బి ఏ లేదా బి కామ్ లేదా బీఎస్ సీ సెమిస్టర్ ఒకటి, మూడు, ఐదు.. కాంటాక్ట్, కౌన్సిలింగ్ తరగతులు ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ రమేష్ ఓ, సమన్వయకర్త రాజేంద్రం తెలిపారు. సెమిస్టర్ -1 విద్యార్థుల పరిచయ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. విద్యార్థులు తప్పనిసరిగా ఈ క్లాసులకు హాజరు కావలిసిందిగా కోరారు.

# నేడు వాలీబాల్ టోర్నమెంట్



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ అమన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఒక రోజు వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభించడం జరుగుతుందని అమన్ యూత్ అధ్యక్షులు పుర?న్ ఖాద్రి తెలియజేశారు. ఆసక్తిగల క్రీడాకారులు 62811 60406 ఫోన్ నెంబర్‌కి ఫోన్‌చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఎలాంటి ఎంట్రీ ఫీజులు ఉండబోవని కేవలం రుద్రూర్ మండలానికి సంబంధించిన జట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన స్పష్టంచేశారు. గెలుపొందిన విజేతలకు బహుమతుల తో పాటు నగదు ప్రోత్సాహకాలు ప్రోత్సాపకాలుకూడా అందజేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. టవర్న మెంట్ కు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఆయన తెలియజేశారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం మాత్రమే కాకుండా మానసిక బలం కూడా పెరుగు తుందన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి స్నేహపూర్వక మైనదృక్పథంతో టోర్నమెంట్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యేను గ్రామ యువకులు..!

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతరం గ్రామ శివారులో బిక్క వాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తాం అని హామీ ఇచ్చి ఇంతవరకు బ్రిడ్జి కు తట్టేడు మట్టి కూడా పొయ్యలేదు అని గ్రామ యువత ప్రశ్నించ్చారు. ఈ సందర్భంగా గ్రామ యువకుడు అక్కేం నాగరాజు మాట్లాడుతూ హామీలకు మాత్రమే పరిమితం అవుతున్న అభివృద్ధి అని బ్రిడ్జి పనులుగ డం లేదు అని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆన్ వీల్స్ అనే ప్రోగ్రాం అనంతారం గ్రామంలో పెట్టి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తాం అని చెప్పి ఇంత వరకు పూర్తి చెయ్యలేదు అని హామీలకే తప్ప అమలులో లేని అభివృద్ధి అని ఈ రోజు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ని గ్రామంలో అడ్డుకొని అడగగా కాంట్రాక్టర్స్ రావడం లేదు అని నిర్లక్షంగా సమాధానం చెప్పారని అన్నారు. అలాగే మండలంలోని చాలా గ్రామాల్లో పల్లెల్లో రోడ్లు అద్వాణంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ ఇలాంటి నిర్లక్ష్య సమాధానాలకు రానున్న రోజుల్లో ఈ కాంగ్రెస్ పార్టీ కి బుద్ది చెప్పే రోజులు దగ్గర లోనే ఉన్నాయి అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వొళ్లాల మధు, ఉతకం వెంకటేష్, వొళ్లాల విన్ను, అల్లెపు కార్తీక్, చొప్పరి కిరణ్, సింగరి అఖిల్, చొప్పరి నాగరాజు,శ్రీధర్, నాగరాజు, పాల్గొన్నారు.

# అంగన్వాడీ భవనానికి భూమి పూజ

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేశారు. అలాగే ముస్కానీపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర మిగుల పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓ. అంతగిరి టెంపుల్ చైర్మన్ అంతగిరి ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఊట్కూరి వెంకట రమణారెడ్డి ,పసుల వెంకటి, మాజీ సర్పంచ్ ముత్యం అమర్ గౌడ్, యాస తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షులు బిగుల్ల విజయ్. ఉమా రెడ్డి శ్రీనివాస్. కంది లక్ష్మణ్. రాచకొండ రోషెల్. తీగల పుష్పలత. తోపాటు వివిధ శాఖల అధికారులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలుకు సన్మానం

**వేద న్యూస్, చొప్పదండి:**



రామడుగు శాతవాహన యూనివర్సిటీలో ఇంగ్లీష్ విభా గంలో మాస్టర్ డిగ్రీ పొంది గవర్నర్ చేతుల మీదు గా గోల్డ్ మెడల్ తీసుకున్న వనజా దేవిని గోపాల్ రావుపెట్ లోని ప్రగతి పాఠశాల యాజ మాన్యం అభినందించి పాఠశాలలో ఇంగ్లీష్ బోధిస్తున్న జానకి దేవిని ఈ మేరకు శని వారం పాఠశాల తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

# ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

**ఫిల్లర్ రూఫింగ్ తో ఖర్చు ఆదా**

ఈ సందర్భంగా ఇల్లంతకుంటలో ఉన్న 40, ఓబులాపూర్ లో 24 ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేసి, ప్రొసీడింగ్స్ ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ పంపిణీ చేశారు. హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ ను ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ కలిసి ప్రారంభించారు. ఇంటిలో ఉష్ణోగ్రత కొన్ని డిగ్రీలు తగ్గించేందుకు, స్లాబ్ నిర్మాణ ఖర్చు తగ్గించేందుకు ఫిల్లర్ రూఫింగ్ విధానంలో పూర్తి చేయడాన్ని చూసి అభినందించారు. అనంతారం గ్రామంలో గన్నెపల్లి అనూష అనే లబ్ధిదారు ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకోగా, నూతన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ హాజరయ్యారు. గృహ ప్రవేశం చేసి, లబ్ధిదారుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడారు. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల స్వంత ఇంటి కల నెరవేరుతున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని వెల్లడించారు. నాలుగు విడతల్లో రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం మంజూరు చేస్తుందని వెల్లడించారు. వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని పిలుపు ఇచ్చారు.అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. తుది దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసి, గృహ ప్రవేశానికి ఆహ్వానించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ, హౌసింగ్ డీఈ ఖాజా ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

# చేప పిల్లల పెంపకంతో ఆదాయానికి పెంచుకోవచ్చు



**వేద న్యూస్,ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి రిజర్వాయర్ లో మత్స్యచేప పిల్లలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తున్నదని, మత్స్య కారుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదన్నారు.గుత్తేదారులకు ఇవ్వకుండా మత్స్యశాఖ అధికారులతో కలిసి ఆయన చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చేపపిల్లల పెంపకాలను ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. ప్రభుత్వమే రిజర్వాయర్లు, చెరువుల్లో ఉచితంగానే చేపపిల్లలను వదలుతోందన్నారు. చేపల చెరువులను దళారులకు అప్పగించకుండా మత్స్యకారులే స్వయంగా స్వయంగా చేప పిల్లల పెంపకం చేపట్టాలన్నారు. చెరువుల్లో వదిలిన చేప పిల్లలు పెరిగి పెద్ద అయిన తర్వాత మత్స్యకారులు వాటి విక్రయాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహిస్తూ తద్వారా వారి సంపాదన శక్తిని పెంచుతున్నదన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తున్నదన్నారు.చేపల వేట వృత్తిగా జీవిస్తున్న కుటుంబాల వారి సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు.

**అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ**

ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న అంగన్వాడీ నూతన భవన నిర్మాణానికి శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాలను ఆధునీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో భాగంగానే అంగన్ వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తోందని, ఆ కోవలోనే అనంతగరి అంగన్వాడీ కేంద్రానికి నూతన భవన నిర్మాణం చేపడుతున్నట్టు ఆయన వివరించారు.

**రేపాకలో....**

ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని, అందులో భాగంగానే డ్రైనేజీల వ్యవస్థను మెరుగు పరుస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్య క్రమాల్లో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు ఊట్కూరి వెంకట రమణారెడ్డి,గుడిసె అయిలయ్య, పసుల వెంకటి,మహేందర్ రెడ్డి. తీగల పుష్పలత, తోపాటు వివిధ శాఖల అధికారులు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**వేద న్యూస్,వరంగల్:**



నల్లబెల్లి మండలం గోవిందాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో, రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యాన్ని తొందరగా తూకం వేసి రైస్ మిల్లులకు పంపాలన్నారు. రైతులు తమ ధాన్యంపై టార్పాలిన్స్ కవర్స్ కప్పే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ట్యాబ్ లో రైతుల వివరాలు నమోదు చేసి వారి అకౌంట్లో తొందరగా డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు.తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేస్తూ మిల్లులకు తరలించాలని తూకం విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. క్రమపద్ధతిలో తూకం వేస్తూ మిల్లులకు తరలించాలని రైతులు నియమాల ప్రకారం.. తేమ శాతం వచ్చేలా చూడాలని సూచించారు. ధాన్యాన్ని ప్యాడి క్లీనర్లలో శుభ్రం చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఎఓ అనురాధ, డిఎం సివిల్ సప్లైస్ సంధ్యారాణి, డి ఎస్ ఓ కిష్టయ్య, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

**- కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. శనివారం నగర పరిధి లోని ఉనికిచర్ల మడికొండ తరాలపల్లి సిద్దార్థ నగర్ ప్రాంతాల్లో పూర్తి ఐన అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయి లో పరిశీలించి సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నగర పరిధి లోని 46 వ డివిజన్ ఉనికిచర్ల ప్రాంతంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్ తో పాటు స్మశాన వాటిక లో ర్పాటు చేసిన బర్నింగ్ ప్లాట్ ఫాం,నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన బోర్ ప్రహరీ గోడ తదితర అభివృద్ధి పనులను 64 వ డివిజన్ మడికొండ ప్రాంతం లో గ్రావెల్ రోడ్డు పనులను తరాలపల్లి లో సి సి రోడ్డు సిద్దార్థ నగర్ లో కమ్యూనిటీ హాల్ తో పాటు 15 వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మాణం కొనసాగుతున్న అర్బన్ ఆరోగ్య కేంద్ర (యు పి హెచ్ సి) నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని వేగవంతం గా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఈఈ రవి కుమార్, డి ఈ రవి కిరణ్, ఏఈ రామన్న, వర్క్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# కాలాన్ని నమోదు చేసే పుస్తకం "ఆపరేషన్ కగార్"




**పుస్తకం పేరు : ఆపరేషన్ కగార్**
**( విశ్లేషణాత్మక వ్యాసాలు-శాంతి చర్చల అవశ్యకత - స్పందలు )**
**పేజీలు : 128**
**వెల : రూ. 150**
**ప్రచురణ కాలం : జూన్, 2025**
**ప్రచురణ : తెలంగాణ పబ్లికేషన్**
**ప్రతులకు : తెలంగాణ పబ్లికేషన్**
**అన్ని లీడింగ్ బుక్‌స్టాల్స్ తోపాటు ఆన్లైన్లో లభించును.**
**జస్టిస్ చంద్ర కుమార్ ముందుమాటతో...**
**సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు,**
**కె. శీనివాస్, జి. రాములు తదితర ప్రముఖుల విశ్లేషణలు, అధికారప్రతిపక్ష పార్టీల స్పందనలతో కూడిన పుస్తకం.**




**దామెర రాజేందర్ (దారా) సీనియర్ జర్నలిస్ట్ పుస్తక సంపాదకులు**

"నువ్వు పువ్వులన్నీ చిదిమేయగలవేమో గానీ వసంతం రాకుండా ఆపడం నీ తరం కాదు". అంటారు నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత పాబ్లో నెరూడా. అందుకే మనుషులను భౌతికంగా అంతం చేసినంత మాత్రాన పరిష్కారం దొరుకదని చరిత్ర చెప్తున్న సత్యం. ఇది ప్రస్తుతం మధ్య భారతంలో ఆపరేషన్ కగార్ (అంతిమ యుద్ధం) పేరుతో మావోయిస్టులపై పాలకులు సాగిస్తున్న మారణహోమానికి కూడా వర్తిస్తుందని భావిస్తున్నాం. ఆపరేషన్ కగార్ పేరుతో సాగుతున్న మారణ హోమంలో మావోయిస్టులపై పాలకులు పైచేయిగానే ఉన్నారు. కానీ ప్రజాస్వామ్య దేశంలో కనీస చర్చలకు కూడా తావివ్వకుండా ముందుకు సాగుతున్న ప్రజాస్వామ్య దేశం మనది అనక తప్పడం లేదు. ఇక్కడ పాలకులను ప్రశ్నించినా ప్రమాదమే అవుతుంది. ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా భావప్రకన చేసినా ప్రమాదమే. వారి కన్నుపడితే మన చేతిలో పెన్ను ఉన్నా గన్ను అవుతుంది. మన సంకలో రాజ్యాంగ పుస్తకం ఉన్నా అది నిషేధమే అవుతుంది. తక్షణమే వారు అర్బన్ నక్సలైట్లుగా ముద్ర పడిపోతారు. ఎంతో గొప్పగా చెప్పుకునే ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి పరిస్థితి ప్రజా స్వామ్యా నికి చేటు. ఆపరేషన్ కగార్ లో ప్రాణాలు కోల్పోతున్న వారు అటు మావోయిస్టులైనా, ఇటు పోలీసులు, భారత సైన్యం, ఎవరైనా మనుషులే. ఎవరు కూడా చని పోకూడదనేదే మా ఉద్దేశ్యం. మనుషులను అంత మెందించి నంత మాత్రానా శాశ్వత పరిష్కారం దొరకదనేది ఇరుపక్షాలు భావించాలని, శాంతి చర్చలే పరిష్కారం అని భావిస్తు న్నాం.ఆపరేషన్ కగార్ పై విశ్లేషణాత్మక వ్యాసాలు - స్పందనలు - శాంతి చర్చల అవశ్యకత స్పృహతో అనేక విభిన్న వ్యక్తుల అభిప్రాయాలు విశ్లేష ణలతో కూడిన ఈ వ్యాస సంకలనం సమాజం ముందు పెట్టుతున్నాం. ఎవరి పక్షమో వహించి ఈ వ్యాసం సంకలనాన్ని పొందుపరుచడం లేదు. శాంతిని కాంక్షిస్తూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని గౌరవిస్తూ వాటిని కాపాడాలనే భావనతో ఈ వ్యాస సంకలనానికి పూనుకోవడం జరిగింది. చరిత్రలో ఒక కాలం సరైన విధంగా నమోదు కాకుంటే ఆ కాలపు చరిత్ర భవిష్యత్తు తరాలకు రకరకాలుగా అర్థం అవుతుంది. మొన్నటికి మొన్న తెలంగాణ చరిత్రను అదే చరిత్ర అన్నట్లుగా తెరకెక్కిన "రజాకార్" సినిమా లాగా. అందుకే ఆపరేషన్ కగార్ కాలంలో ఎలాంటి భావ సంఘర్షణ జరిగింది. మేధావులు, ప్రజాస్వామ్యాన్ని కోరుకునే వారు ఎలాంటి అభిప్రాయాలు వ్యక్తపరిచారు. ఆపరేషన్ కగార్ కాలం ఎలా సాగింది అనేది నమోదు చేయడంలో భాగమే ఈ వ్యాస సంకలన ప్రయత్నం. ఇందులో 25మంది రాసిన 40వ్యాసాలతో పాటు అధికార ప్రతిపక్ష పార్టీల స్పందనలు, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, పౌర స్పందనలు కూడా పొందుపరుచడం జరిగింది. ఈ వ్యాస సంకలనంలోని వ్యాసాలు ఏకపక్షంగా లేవనేది, విభిన్న కోణాల్లో చర్చించిన వ్యాసాలు అనేది గమనించాలి. ఈ వ్యాస సంకలనం నిడివి రిత్యా, సమయాభావం రిత్యా, అవకాశం మేరకు సేకరించిన వ్యాసాలు స్పందనలు ఇందులో పొందుపరుచడం జరిగింది. ఇంకా అనేకులు, మేధావులు, విభిన్న కోణాల్లో వ్యక్తపరిచిన భావాల వ్యక్తీకరణను, అభిప్రాయాలను సేకరించలేకపోచ్చు. ఇందులో పొందుపరుచలేక పోవచ్చు. దీనిని సమాచార సేకరణలో జరిగిన లోటుగానే భావించాలని కోరుతున్నాం. ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో శక్తిమేరకు ఈ వ్యాస సంకలనం తిసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ఈ చిన్న ప్రయత్నాన్ని ఆపరేషన్ కగార్ కాలంలో భావ వ్యక్తీకణగానే భావించి స్వాగతిస్తారని భావిస్తున్నాం.

# ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు

**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**



గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా జయంతి వేడుకలను గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం వేడుకలు నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరి మ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, బిర్సా ముండా చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడారు. గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా అని కొనియాడారు. ఇక్కడ డీటీడబ్ల్యూఓ సంగీత, ఏఓ రాంరెడ్డి, డీఎం డబ్ల్యూఓ భారతి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, ఎల్డీఎం మల్లికార్జున రావు, అధికా రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్వెట్టర్స్ పంపిణీ

**వేద న్యూస్, చొప్పదండి**



శీతాకాలం ప్రారంభం అయినందున షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ కరీంనగర్ జిల్లా తరుపున చొప్పదండి లోని ఎస్ సి ఇంట్రిగ్రేటెడ్ బాలుర వసతి గృహం లో ఉన్న విద్యార్థులకు శనివారం స్వెట్టర్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ నాగలేశ్వర్ కు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యం, కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# "అరణ్యకము" పుస్తక ఆవిష్కరణ

సమాజంలో పర్యావరణ అవగాహన పెరగాలనే నిబద్ధతతో పుస్తకం రచించడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. ప్రభుత్వ పర్యావరణ కార్యక్రమాలకు ఇటువంటి రచనలు మద్దతు ఇస్తాయని, కొత్త తరాలకు ప్రకృతి సంరక్షణపై స్ఫూర్తినిస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాల మధ్య ప్రకృతిని సంరక్షించడం మరింత సవాలుగా మారిందని వ్యాఖ్యానించారు. అడవుల నరికివేత, వాతావరణ మార్పులు, నీటి కొరత వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే పర్యావరణానికి అనుకూలమైన చర్యలు అవసరమని తెలిపారు. "అడవులు లేకపోతే జీవసంపద నశిస్తుంది%ౌ% వర్షపాతం ప్రభావితం అవుతుంది. మన జీవనవ్యవస్థ కుదేలవుతుంది" అని ఆమె గుర్తుచేశారు. అడవుల సంరక్షణలో ప్రభుత్వంతో పాటు సామాజిక సంస్థలు, పాఠశాలలు, యువత, సాధారణ ప్రజలు సైతం చురుకుగా పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు. చెట్లు నాటడం, అభివృద్ధి పనుల్లో పర్యావరణ ప్రమాణాలను పాటించడం, అడవి వనరులను కాపాడటంలో అవగాహన పెంచడం వంటి చర్యలు ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. "పర్యావరణ రక్షణ వ్యక్తిగత బాధ్యతగా భావించినప్పుడు మాత్రమే రాష్ట్రం పచ్చగా, ఆరోగ్యంగా ఉంటుంది" అంటూ మంత్రి చెప్పిన సందేశం ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

# సీపీ సజ్జనార్ పేరుతో ఫేక్ అకౌంట్ మోసం

ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపేందుకు మోసగాళ్లు ఉపయోగించారు. "అత్యవసరం ఉంది. ఆపదలో ఉన్నాను. వెంటనే డబ్బు పంపండి" అంటూ పంపిన సందేశాలు చూసి ఒక స్నేహితుడు నిజమేనని భావించి డబ్బు పంపాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన అధికారిక ఖాతా తప్ప మిగతా అన్ని ఖాతాలు నకిలీవేనని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనతో సైబర్ సెక్యూరిటీ ప్రమాదం ఎంత తీవ్రమైందో మరోసారి బయటపడింది. ఈ నేపథ్యంలో సజ్జనార్ ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. ప్రముఖుల పేర్లతో వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దని, సందేశాలు వచ్చినా డబ్బులు పంపకూడదని హెచ్చరించారు. ఆ వ్యక్తితో నేరుగా ఫోన్‌లో మాట్లాడి నిర్ధారించుకోవడం తప్పనిసరి అని సూచించారు. అలాగే అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, తెలియని ఖాతాల నుంచి వచ్చే వ్యక్తిగత సమాచార అభ్యర్థనలను వెంటనే బ్లాక్ చేయాలని, 1930 సైబర్‌హెల్ప్‌లైన్‌కు లేదా అధికారిక వెబ్‌సైట్‌కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మోసంపై ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసులు చర్యల్లోకి దిగారు. నకిలీ ఖాతాలను ట్రేస్ చేసి మెటా సహకారంతో తొలగించే ప్రక్రియలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు, సామాన్యులు అని తేడా లేకుండా సైబర్ నేరగాళ్లు అవకాశాలను వెతుకుతున్నందున, సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అత్యంత కీలకం అని పోలీసులు సూచిస్తున్నారు. వేగంగా పెరుగుతున్న ఈ మోసాల నేపథ్యంలో ప్రజలు ప్రతి డిజిటల్ కమ్యూనికేషన్‌ను జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం మరింతగా పెరిగింది.

# బీహార్‌లో ఓటమి వేళ లాలూ ప్రసాద్‌కు మరో షాక్...

డెస్క్ : ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నారు. అంతేకాదు, కుటుంబంతో సంబంధాలను కూడా తెంచుకుంటున్నట్లు ప్రకటించారు. ఇటీవల జరిగిన 2025 బీహార్ ఎన్నికల్లో ఆర్జేడీ ఘోర పరాజయం పాలై కేవలం 25 సీట్లకు పరిమితమైంది. మొత్తం 243 స్థానాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే 202 స్థానాలు గెలుచుకుని విజయం సాధించింది. ఈ ఓటమి నుంచి తేరుకోకముందే లాలూ ప్రసాద్ యాదవ్‌కు కుమార్తె రోహిణి ఆచార్య షాకిచ్చారు. రాజకీయాలకు, కుటుంబానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆమె 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "నేను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నాను. అదే విధంగా నా కుటుంబంతో కూడా సంబంధాలు తెంచుకుంటున్నాను. సంజయ్ యాదవ్, రమీజ్ నన్ను ఇదే చేయమని అడిగారు" అంటూ ఆమె ఒక సంచలన ట్వీట్ చేశారు. తేజస్వి యాదవ్‌కు సన్నిహితులైన సంజయ్ యాదవ్ తనను తప్పుకోమని చెప్పారని ఆమె ఆరోపించారు. ఇలా ఎన్నికల్లో ఆర్జేడీ ఘోర పరాజయం పాలైన సమయంలో రోహిణి ఆచార్య ప్రకటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రోహిణి ఆచార్య వృత్తీరీత్యా వైద్యురాలు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లోని సరన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి బీజేపీ అభ్యర్థి రాజీవ్ ప్రతాప్ రూడీ చేతిలో ఓటమి పాలయ్యారు.


# రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

దిశానిర్దేశం కోసం కూడా ఈ భేటీ జరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సమావేశానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హాజరుకావడం భేటీ ప్రాముఖ్యతను మరింత పెంచింది. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, జూబ్లీహిల్స్ నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను కాంగ్రెస్ కేవలం ఒక స్థానిక విజయం కాకుండా, నగర రాజకీయాల్లో పార్టీ పునరుజ్జీవానికి నిదర్శనంగా చూస్తోంది. ఈ నేపథ్యంలో, హైకమాండ్‌తో జరిగిన చర్చల్లో పార్టీ భవిష్యత్ దిశ, పట్టణ ఓటర్లను చేరుకునే విధానం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కాంగ్రెస్ బలాన్ని పెంచడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివరమైన చర్చ జరిగింది. సమాచార ప్రకారం, రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ దూసుకెళ్లే అవకాశం ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. ఉప ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి నాయకత్వంపై పార్టీ అధిష్ఠానం అసంతృప్తిగా ఉందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో విస్తరించింది. ముఖ్యంగా, రాష్ట్ర ప్రభుత్వంపై వచ్చిన విమర్శలు, కొన్ని కీలక అంశాలపై పార్టీ లోపల అసమ్మతి ఉన్నట్లుగా ప్రచారం కొనసాగింది. అయితే జూబ్లీహిల్స్ గెలుపు తర్వాత హైకమాండ్ నుంచి వచ్చిన స్పందన, వెంటనే జరిగిన రేవంత్%-%రాహుల్ భేటీ ఈ ప్రచారాలకు పూర్తి విరామం ఇచ్చినట్లైంది. రేవంత్ నాయకత్వంపై పునరుద్ధరణ విశ్వాసం వ్యక్తమవడంతో పాటు, తెలంగాణలో కాంగ్రెస్ శక్తిసామర్థ్యాలను మరింతగా పెంచేందుకు కేంద్రం నుండి పూర్తి మద్దతు అందుతుందని సంకేతాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, ప్రజల్లో రేవంత్ తీసుకువచ్చిన పరిపాలన పద్ధతి, సంక్షేమ కార్యక్రమాలు పార్టీకి మద్దతు పెరుగుతున్నాయని హైకమాండ్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. తదుపరి నెలల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్‌కు అత్యంత కీలకంగా మారాయి. ఈ ఎన్నికల్లో పార్టీ ఆధిపత్యం సాధిస్తే, రాష్ట్రవ్యాప్తంగా రేవంత్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న మద్దతు మరింత ఐక్యమవుతుందని పార్టీ అంచనా వేస్తోంది. సమావేశంలో వార్డు స్థాయి నుంచి జిల్లా స్థాయివరకు పార్టీ కమిటీలను బలోపేతం చేయడం, క్రియాశీల కార్యకర్తలను గుర్తించడం, బూత్ స్థాయిలో ప్రచారం వ్యూహాలను రూపొందించడం వంటి అంశాలు ప్రధానం అయ్యాయి. అదే సమయంలో ప్రతిపక్షాల వ్యూహాలను సమీక్షించి, అవకతవకలు, అపోహలను ఎదుర్కొనే విధానంపై కూడా చర్చించారని సమాచారం. జూబ్లీహిల్స్ విజయం ఇచ్చిన తనఖాను రాష్ట్రవ్యాప్తంగా పునరావృతం చేయాలని నిర్ణయించుకున్న కాంగ్రెస్, ముందస్తు ఎన్నికల సన్నాహాల్లో మరింత వేగం పెంచనుంది.

# రోడ్డు ప్రమాదంలో వెయిట్ లిఫ్టర్ సత్యజ్యోతి దుర్మరణం

**- విజయనగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెయిట్‌లిఫ్టర్ మృతి**
**- రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తుండగా లారీ ఢీకొని దుర్మరణం**

డెస్క్ : రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకం సాధించాలని వెళుతున్న ఓ క్రీడాకారిణిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ విషాద ఘటన విజయనగరం జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వెయిట్‌లిఫ్టర్ తాడుతూరి సత్యజ్యోతి (26) అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల్లోకి వెళితే, నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన సత్యజ్యోతి, ఆమె సోదరి సరోజా గాయత్రి ఇద్దరూ వెయిట్‌లిఫ్టింగ్‌లో ఎన్నో పతకాలు సాధించారు. సత్యజ్యోతి ప్రస్తుతం విశాఖపట్నంలోని వాల్తేరు రైల్వే డివిజన్‌లో క్లర్కుగా పనిచేస్తున్నారు. కొండవెలగాడలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల కోసం తన సోదరి గాయత్రితో కలిసి స్కూటీపై బయలుదేరారు. విజయనగరం పట్టణ సమీపంలోని వైఎస్ఆర్ నగర్ దాటిన తర్వాత, ఎదురుగా వేగంగా వస్తున్న ఓ లారీ వీరి స్కూటీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యజ్యోతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఆమె సోదరి గాయత్రికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రతిభావంతురాలైన క్రీడాకారిణి అకాల మరణంతో ఆమె స్వగ్రామం కొండవెలగాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సత్యజ్యోతి మృతి పట్ల శాప్ ఛైర్మన్ రవినాయుడు, జిల్లా కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.



వేద న్యూస్

ఆదివారం నవంబర్ 16, 2025

# ఆచార్య రామస్వామికి లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు



**వేద న్యూస్ కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎన్. రామస్వామికి అరుదైన గౌరవం లభించింది. బయోటెక్నాలజీ రంగంలో ఆయన చేసిన విశిష్ట పరిశోధనలకు గుర్తింపుగా, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్-2025 ను చెన్నై తమిళనాడులోని సైంటిఫిక్ లారియేట్స్ కమిటీ, నవంబర్ 14 వ తేదిన ఆన్ లైన్ వేదికగా ప్రధానం చేసింది. బయో టెక్నాలజీ రంగంలో, పరిశోధనలో ఆయన చేసిన సేవలు దేశ-విదేశాలలో విశేష గుర్తింపు పొందాయి. గతంలో కూడా ఆచార్య రామస్వామి ఆంధ్రప్రదేశ్ సైంటిస్ట్ అవార్డు, అకాడమీ ఆఫ్ ప్లాంట్ సైన్సెస్ ఇండియా అవార్డు, స్టేట్ మైనారిటీస్ బెస్ట్ టీచర్ అవార్డు, అమెరికా సంయుక్త రాష్ట్రాల టాలెంటెడ్ సైంటిస్ట్ అవార్డు, టాలెంటెడ్ బయోటెక్నాలజిస్ట్ అవార్డు సహా అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వ విద్యాలయ విసి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు ఆచార్య రామస్వామికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# వయోవృద్ధులను గౌరవిద్దాం




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వయోవృద్ధులను గౌరవిద్దాం - వారి అనుభవాల్ని స్వీకరిద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వారోత్సవాలలో భాగంగా శనివారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తా నుండి పోస్ట్ ఆఫీస్ సర్కిల్ వరకు వయోవృద్ధుల వాకతాన్ (ర్యాలీ) నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్యఅతిథిగా పాల్గొని, జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఈనెల 12 నుండి 19వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాచీన కాలం నుండి భారత దేశ సంస్కృతిలో వయోవృద్ధులను గౌరవించడం మన సంస్కృతి అని,వారి పట్ల ప్రతి ఒక్కరూ మర్యాదగా ఉండేవారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో కూడా అలాగే వయోవృద్ధులను గౌరవించి వారిపట్ల మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. సమాజంలో వయోవృద్ధుల ప్రాముఖ్యత చాలా గొప్పదని, వారు దిశా నిర్దేశకులని తెలిపారు. అలాగే ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి మన కుటుంబంలో ఉన్న వయోవృద్ధులను అనగా గ్రాండ్ పేరెంట్స్ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వారితో మర్యాదగా ఉండాలని, వారి అనుభవం పిల్లలకు చాలా స్ఫూర్తినిస్తుందని అన్నారు. ప్రస్తుతము వయోవృద్ధుల సమస్యలు పిల్లలు కొడుకులు కోడళ్ళు సరిగ్గా చూసుకోవట్లేదని, వారిని ఇబ్బందులకు గురి చేస్తూ కొట్టడం తిట్టడం ఆస్తులు లాక్కోవడం ఇలాంటి సమస్యలు మా దృష్టికి చాలా వస్తున్నాయని. వారి పట్ల ప్రత్యేక దృష్టి పెట్టామని, తల్లిదండ్రుల పోషణ సంక్షేమ చట్టం ప్రకారం బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటూ వారికి భరోసా కల్పిస్తున్నామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి రాజమణి డి ఎం,హెచ్ ఓ సాంబశివరావు డీఈవో రంగయ్య నాయుడు, సి డి పి ఓ లు విద్య మధురిమ, దెబోరా సూపర్వైజర్లు, డిసిపిఓ ఉమా , సఖి అడ్మిన్ శ్రీలత జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది ఎఫ్, ఆర్,ఓ, జిల్లా వయోవృద్ధుల కమిటీ మెంబర్స్ మల్లారెడ్డి, రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపల్ వీర ఉపేందర్ టీచర్స్, సిబ్బంది విద్యార్థులు, జిల్లాలోని పలు ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు, వయోవృద్ధుల అసోసియేషన్ మెంబర్స్, వయోవృద్ధులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

## కాళేశ్వరాలయాన్ని దర్శించుకున్న

# లేబర్ డిప్యూటీ కమిషనర్ ప్రసాద్



**వేద న్యూస్, భూపాలపల్లి :**

దక్షిణ కాశిగా పేరుఘంచిన శ్రీ కాళేశ్వరముక్తీశ్వరా స్వామి వారిని కార్తీక మాసం పురస్కరించుకొని శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా లేబర్ డిపార్ట్మెంట్ డిప్యూటీ కమిషనర్ ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటరమణ, అసి స్టెంట్ లేబర్ ఆఫీసర్ రఫీ, మగ్రి సతీష్ యాదవ్, బి మురళి కుమార్, సత్యం, సంపత్, మనోజ్ దర్శించుకున్నారు. ముందుగా ఆలయ గర్భ గుడిలో అభిషేకం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. వారితో పాటు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం తేల్చుకోవాలి..!

**- బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీతో కొట్లాడుతారో, బీసీలకు దోషులుగా నిలబడతారో**



**వేద న్యూస్ కేయూ క్యాంపస్:**

బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించడానికి డిసెంబర్ 1వ తేదీ నుండి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగాన్ని సవరించాలని ఎందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానితో భేటీ కావాలని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు, ప్రధాని సమయం ఇవ్వకపోతే ఇండియా కూటమి తరపున పార్లమెంటు సమావేశాలను స్తంభిం పచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న బీసీల ధర్మ పోరాట దీక్షల ముగింపుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నబీసీ దీక్షలతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి పార్లమెంటులో బీసీ బిల్లు పై చర్చకు పెట్టీ రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ రిజర్వేషన్ల చట్టానికి ఆమోదం తెలపాలని, లేదంటే డిసెంబర్ మొదటి వారంలో వేలాది మందితో పార్లమెంటును దిగ్బంధం చేస్తామని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన సందర్భంగా కష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 17న జరిగే క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల పై ప్రభుత్వంలో ఒక నిర్ణయం తీసుకుంటుందని చెప్పడాని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, డిసెంబరు ఒకటవ తేదీ నుండి జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి అఖిలపక్షంతో వెళ్లాలనీ పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ కేంద్రంపై పోరాడడానికి రాజకీయ కార్యచరణ ప్రకటించాలనీ ఆయన డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచడానికి ఢిల్లీ వేదికగా పోరాడాలని రాష్ట్రానికి అయన సూచించారు, కేంద్రంపై పోరాడకుండా స్థానిక ఎన్నికలు వెళ్తే బీసీలకు కాంగ్రెస్ దోషిగా మిగులుతుందన్నారు,బీసీలను నమ్మించి మోసం చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై బీసీల తిరుగుబాటు తప్పదన్నారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించకుండా స్థానిక ఎన్నికలు వెళితే బీసీలు రాష్ట్రంలో అగ్గి రాజేస్తారనీ, సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, సమ్మక్క సారక్కల వలె బీసీలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దండెత్తరని హెచ్చరించారు. ఢిల్లీతో కాంగ్రెస్ పోరాడితే దేశంలోని బీసీల అండ కాంగ్రెస్ పార్టీకి ఉంటుందని, బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయకుండా తప్పించుకుంటున్న బిజెపిని బీసీల దోషిగా చేసే బాధ్యత బీసీ సమాజం తీసుకుంటుందన్నారు. బీసీ ప్రధానిగా నరేంద్ర మోడీ గత 11 సంవత్సరాలుగా దేశాన్ని పరిపాలిస్తున్నప్పటికీ బీసీల డిమాండ్లను ఏ ఒక్కటి నెరవేర్చకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. బిజెపికి బీసీల పై చిత్తశుద్ధి ఉంటే డిసెంబరు లో జరిగే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి గత ఎన్నికలలో బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి ప్రతిపక్ష నాయకుడు కూడా బిసిని చేయలేదని బీసీ కులగలను బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్నందునే నిన్నటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీసీలు బిజెపికి డిపాజిట్ రాకుండా చేశారని, బీసీ వైఖరితో బిజెపి ఉంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ఎన్నికలే పునరావృత్తం అవుతాయని ఆయన హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లపై బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి బీసీ జేఏసీ ఇప్పటికే గత సెప్టెంబర్ 18న రాష్ట్ర బంద్ నిర్వహించామని, నవంబర్ 6 పూలే అంబేద్కర్ విగ్రహాల ముందు నిరసన దీక్షలు చేపట్టామని, మొన్న 13న తెలంగాణలోని 33 జిల్లాలు 119 నియోజకవర్గాలు అన్ని మండల కేంద్రాల్లో వేలాదిమంది రోడ్ల మీదకు వచ్చి ధర్మదీక్షలో చేశామని, రేపు రన్ ఫర్ సోషలిసిస్ పేరుతో ర్యాలీలు తీస్తామని, డిసెంబర్లో గల్లి నుండి ఢిల్లీ వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను స్తంభింప చేస్తామని ఆయన తెలిపారు. బీసీ రిజర్వేషన్లు సాధించడం కోసం పల్లె నుండి పట్నం దాకా బీసీలు పోరాడుతారని 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదనీ, గల్లీలో తెలంగాణ ఉద్యమ తరహాలో, ఢిల్లీలో రైతు ఉద్యమ తరాలు బీసీ ఉద్యమించి విజయం సాధించాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. కేయూ బీసీల ధర్మ పోరాట దీక్ష ముగింపు సందర్భంగా బీసీ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ నాగరాజ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ దీక్షలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ, బీసీ జేఏసీ నాయకులు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్, డా. సంగాని మల్లేశ్వర్, డా.చిర్ర రాజు గౌడ్, బోనగాని యాదగిరి గౌడ్, వరంగల్ శ్రీనివాస్, భీమగాని యాదగిరి, మాదం పద్మజదేవి, తమ్మేలా శోభరాణి, వేముల మహేందర్,డ్యాగాలశ్రీనివాస్, అజయ్ సింగ్,అన్వేష్ ,రాజశేఖర్,కాగితపు నాగరాజు,అనిల్, సుమన్ రాజ్, నితిన్,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# వేగమే ప్రమాదాలకు ప్రధాన కారణం..!



**వేద న్యూస్, హైదరాబాద్ :**

రహదారులపై నియంత్రణ లేకుండా అతి వేగం తో ప్రయాణాలు చేస్తే, చిన్న పొరపాటు కూడా పెద్ద ప్రమాదంగా మారొ చ్చని తెలంగాణ పోలీస్ మరోసారి ప్రజలకు గట్టిగా హెచ్చరిక జారీ చేసింది. వేగమే ఎక్కు వ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణ మని, ప్రతి రోజూ ఖరీదైన ప్రాణాల ను కోల్పోతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి చేశాయి.డ్రైవింగ్‌లో వేగం పెంచడం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో పాటు, ఏ ప్రమాదాన్ని ముందే గుర్తించి నిలబెట్టే అవకాశాలు కూడా తగ్గిపోతాయని అధికారులు వివరించారు. రోడ్డు ఖాళీగా ఉందనే కారణంతో స్పీడ్‌గా వెళ్లడం అత్యంత ప్రమాదకరమని పోలీసులు స్పష్టం చేశారు. ప్రతి వాహనం, ప్రతి పరిస్థితి ఒక్కో విధంగా స్పందిస్తుందని, అతి వేగం ఎప్పటికీ సుర క్షితం కాదని పేర్కొన్నారు.అతి వేగం ఎప్పటికీ ఎవరికీ ప్రయోజనం చేకూర్చదనీ, కానీ ప్రాణాలకు మాత్రం భారీ ప్రమాదమేననిలు గుర్తు చేశారు. కుటుంబాలపై, స్నేహితులపై, తమపై జరిగే అనర్థాలను స్పీడ్ డ్రైవింగ్‌తో ఎవరూ తేలికగా తీసుకోకూడదని సూచించారు. “స్పీడ్ థ్రిల్స్ బట్ కిల్స్” అనే నినాదాన్ని మళ్లీ గుర్తు చేస్తూ, చిన్న తప్పిదం కూడా జీవితాన్ని పూర్తిగా మార్చగలదని హెచ్చరించారు.సురక్షిత డ్రైవింగ్‌తోనే కుటుంబాలు ప్రశాంతంగా ఉండగ లవని, మీ నిర్ణయాలు ఇతరుల ప్రాణాలపైనా ప్రభావం చూపు తాయ ని పోలీసులు తెలిపారు. వాహనం నెమ్మదిగా నడపడం సిగ్గు కాదు, అది బాధ్యత అని వారు తేల్చి చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తేనే రోడ్లు అందరికీ సురకత మవుతాయని తెలంగాణ పోలీస్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# మానసిక ఆరోగ్యంపై తెలంగాణ పోలీస్ సందేశం

**- సహాయం కోరడం బలహీనత కాదు బాధ్యత**

**- అవగాహనతోనే అపహాస్యానికి ముగింపు**

**వేద న్యూస్, హైదరాబాద్ :**

మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమన్న విషయాన్ని తెలంగాణ పోలీస్ బలంగా చాటింది. సమాజంలో మానసిక ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజలు ఈ సమస్యలను తగ్గించుకోటానికి ముందుకొచ్చేలా ప్రోత్సాహించే దిశగా ఈ సందేశాన్ని విడుదల చేశారు. ప్రతి వ్యక్తి మానసికంగా బలంగా ఉండటం ద్వారా కుటుంబాలు, పాఠశాలలు, కార్యాలయాలు మరియు మొత్తం సమాజం మరింత సురక్షితంగా మారుతుందని పోలీసులు పేర్కొన్నారు.ప్రజలు తమ భావాలను బయటపెట్టడం, అవసరమైతే నిపుణుల సహాయం పొందడం ఎంతో అవసరమని అధికారులు తెలిపారు. సమస్యలను దాచిపెట్టడం వల్ల ఒత్తిడి మరింత పెరిగి ప్రమాదకర పరిస్థితులకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. తన మనసు మాట చెప్పడం ధైర్యానికి నిదర్శనమని, ‘సహాయం కోరడం బలహీనత కాదని’ తెలంగాణ పోలీస్ స్పష్టం చేస్తోంది.మానసిక ఆరోగ్య సమస్యలను చుట్టుముట్టే అపహాస్యం, అజ్ఞానం, భయం వంటి అంశాలను తొలగించడానికి సమాజం మొత్తం కలిసికట్టుగా ముందుకు రావాలని పోలీసులు పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, స్నేహి తులు పరస్పరం అండగా నిలిస్తే అనేక సమస్యలు నివారించవచ్చని వారు పేర్కొన్నారు. సమస్యలను అర్థం చేసుకోవడం, కనీసం ఓపికగా వినడం కూడా ఒకరికొకరు పెద్ద సహాయంగా మారుతురని తెలిపారు. మాన సిక ఆరో గ్యంపై అవగా హన పెంచే ఈ ప్రచారం తో సమాజంలో సానుకూల మార్పులు రావాలని తెలంగాణ పోలీస్ ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. బలమైన మన సులు ఉన్నప్పుడే సురక్షిత సమాజం ఏర్పడు తుందని, అందరూ కలిసి మానసిక ఆరో గ్యంపై ఉన్న అపహాస్యానికి ముగింపు పలకాలని పోలీసులు పిలుపు నిచ్చారు.




Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073

వేద న్యూస్

ఆదివారం నవంబర్ 16, 2025

# పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా :**



సమాజం బాగుండాలంటే ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా జీవించా లంటే మనం నివశించే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ప్రభుత్వ విప్, కురుపాం శాసన సభ్యురాలు తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం నాడు కురుపాంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠ శాలలో ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాల న్నారు. ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో ప్రజలందరూ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాలొ నాలని కోరారు. ప్రతీ నెలా మూడవ శనివారం జరిగే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను తెలుసు కోవాలని ఆమె తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, చేతులు ఎప్పటి కప్పుడు శుభ్ర పరచుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డిమాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కలిగించడం జరుగు తుందన్నారు. గత నెల నుండి వ్యక్తిగత శుభ్రతపై ముస్తాబు అనే కార్య క్రమాన్ని ప్రారంభించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. వ్యక్తిగత శు భ్రతే మన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుందన్నారు. చదువుకునే పిల్లలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండాలన్నారు. మీరు మీ గ్రామాల్లో ఎలాఉన్నా రో అలానే పాఠశాలలో కూడా ఉంటే పాఠశాల వల్ల మీకు ఉపయోగం ఏముంటుంది,ఏ విషయాన్నైనా అర్థం చేసుకుంటేనే చదువు మీకు ఉపయోగపడుతుందని, అర్థం చేసుకోకపోతే చదు వుకున్నా ఉపయోగం ఉండదని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. పరీక్షల కోసం బట్టిపట్టి చదివితే సర్టిఫికెట్ వస్తుంది గానీ చదువు యొక్క ప్రాముఖ్యత తెలియదని కలెక్టర్ పిల్లలకు హితవుపలి కారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, సర్వ శిక్షాబి యాన్ ఏపిసి తేజేశ్వర రావు, మండల విద్యాశాఖాధికారి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, మాజీ ఎఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్, సుకేష్ చంద్ర పండా, బలగ రామకృష్ణ, కర్రి శ్రీను, వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈషా సింగ్‌కు సీఎం అభినందనలు

- 25 మీటర్ల ర్యాపిడ్ పిస్టల్ విభాగంలో అద్భుత ప్రతిభ
- ఈషా సింగ్ పట్టుదల దేశ యువ క్రీడాకారులకు స్ఫూర్తి
- భవిష్యత్తులో మరింత గొప్ప విజయాలు సాధించాలని సీఎం ఆకాంక్ష

**వేద న్యూస్, హైదరాబాద్ :**



కైరోలో నిర్వహించిన ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత తరపున పోటీపడిన హైదరాబాద్‌కు చెందిన షూటర్ ఈషా సింగ్ అద్భుత ప్రదర్శన చేసి కాంస్య పతకం సాధిం చారు. ఆమె విజయంపై తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియ జేశారు. మహిళల 25 మీటర్ల ర్యాపిడ్ పిస్టల్ విభాగంలో ఈషా సింగ్ చూపిన ప్రతిభ ప్రశంసనీయమని సీఎం పేర్కొన్నారు. అంత ర్జాతీయ వేదికపై తెలంగాణ రాష్ట్రానికి గర్వ కారణమైన ఈ విజయం ఆమె కఠిన సాధన, అచంచలమైన పట్టుదల ఫలితమని అన్నారు. షూటింగ్ రంగంలో ఈషా చూపు తున్న క్రమ శిక్షణ, నిబద్ధత అనేకమంది యువ క్రీడా కారులకు స్ఫూర్తిగా నిలుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థాయిలో తెలం గాణ, దేశం గర్వించేవిధంగా రాణిం చాలని ఆకాంక్షించారు. ఈషా సింగ్‌పై రాష్ట్ర ప్రభు త్వం పూర్తి సహకారంతో ఉంటుందని, ఆమె భవిష్యత్ క్రీడా ప్రయాణం కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహం అంద జేస్తామని అధికార వర్గాలు తెలియజేశాయి.

# సుద్దకుంట చెరువు వద్ద అపోహలకు ముగింపు



**వేద న్యూస్, ఉప్పల్ :**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్ సుద్దకుంట చెరువు ప్రాంతంలో ఎఫ్‌టీఎల్ పేరుతో నెలలుగా ప్రజల్లో భయాందోళనలు సృష్టించిన సమస్యపై హైడ్రా కమిషనర్ ఏవి రంగానాథ్ ప్రత్యక్షంగా స్పందించారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు శనివారం సుద్దకుంట ప్రాంతాన్ని కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గంటపాటు కొనసాగిన పర్యటనలో నివాసితుల నుంచి సమస్యలపై వివరాలు విని, అధికారులు ఎఫ్‌టీఎల్ పేరుతో సృష్టించిన గందరగోళాన్ని పూర్తిగా నివృత్తి చేశారు. హైడ్రా అంటే భరోసా, హైడ్రా పేరుతో ప్రజలను భయపెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన ప్రకటించడంతో స్థానికులకు భారీ ఊరట లభించింది. ఇళ్లపై అక్రమంగా ఎఫ్‌టీఎల్ మార్కింగ్ వేసిన హెచ్‌ఎండీఏ మరియు మున్సిపల్ అధికారుల వ్యవహారంపై కమిషనర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2014లో చెరువుకు జారీ చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారం చెరువు 3.16 ఎకరాల మేరకు మాత్రమే ఉందని స్పష్టంగా ఉన్నప్పటికీ, అధికారులు అన్యాయంగా హద్దులు మార్చి 30 ఏళ్లుగా నివసిస్తున్న ఇళ్లలో చెరువు ఎఫ్‌టీఎల్ ఉన్నట్లు చూపించడం తగదని కమిషనర్ పేర్కొన్నారు. రోడ్డు వరకు ఎఫ్‌టీఎల్ చూపించి ప్రజల్లో భయభ్రాంతులు కలిగించడం బాధ్యతారాహిత్య చర్యగా వ్యాఖ్యానించారు. ఈ తీరుకు బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానికులు కమిషనర్ ముందు తమ బాధలను వ్యక్తం చేస్తూ, సంవత్సరాలుగా నిర్మాణ అనుమతులతో ఉన్న ఇళ్లను అకస్మాత్తుగా ఎఫ్‌టీఎల్ పేరుతో భవిష్యత్తు అనిశ్చితిలోకి నెట్టారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లపై నంబర్లు వేసి, ఇనుప కడ్డీలు పాతి వదిలిపెట్టడంతో ప్రజలు నెలల తరబడి భయాందోళనలో ఉన్నారని తెలిపారు. ఎన్నో అధికారులను కలిసినా సరైన సమాధానం లేక చివరకు హైడ్రా వద్దకు వచ్చామని నివాసితులు వెల్లడించారు. ఈ ఫిర్యాదులన్నింటిని శ్రద్ధగా విన్న కమిషనర్, ప్రజలకు ఎలాంటి నష్టం జరగనీయమని స్పష్టం చేసి, చెరువు అసలు హద్దులు మార్చే ప్రసక్తే లేదని హామీ ఇచ్చారు.సుద్దకుంట చెరువు వివాదంపై కమిషనర్ ఏవి రంగానాథ్ స్వయంగా పరిశీలన జరపడం, ప్రజలకు పూర్తి భద్రతా భరోసా ఇవ్వడం స్థానికులకు ఘన విజయం లాంటిదే. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఆధారంగానే ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేయడంతో సమస్యకు స్పష్టమైన పరిష్కారం దొరికింది. ఇళ్లపై వేసిన మార్కింగులు వెంటనే తొలగించాలని కమిషనర్ ఆదేశించగా, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చెరువుల కబ్జాదారులపై మాత్రం కఠిన చర్యలు ఉంటాయని, కానీ సంవత్సరాలుగా నివసిస్తున్న కుటుంబాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది పెట్టబోమని హైడ్రా అధికారులు హామీ ఇవ్వడంతో ప్రాంతంలో నెలలుగా కొనసాగుతున్న భయాందోళనలకు ముగింపు లభించింది.

# అభివృద్ధి పనులు వేగవంతం

**- మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన**




**వేద న్యూస్, హుస్నాబాద్ :**

హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన పర్యటనలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఫిషరీస్ కార్పొరేషన్ అధికారి మెట్టు సాయితో కలిసి పశువైద్యశాలను పరిశీలించారు. హుస్నాబాద్ ప్రాంతంలో పశుసంపద అధికంగా ఉండటంతో, రైతులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. పశువైద్యశాలను ఆధునీకరించి అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరగా, వారి అభ్యర్థనను మంత్రి సానుకూలంగా స్వీకరించారు.పరిశీలన అనంతరం పశువైద్యశాలలో మౌలిక సదుపాయాలను అంచనా వేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, అవసరమైన పరికరాలు, సిబ్బంది, అత్యవసర సేవలను త్వరగా అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు సమయానుకూలంగా సేవలు అందడంలో ఈ ఆధునీకరణ పెద్ద పాత్ర వహిస్తుందని పేర్కొ న్నారు.తరువాత స్థానిక ఫిష్ మార్కెట్‌ను మంత్రి పరిశీలించారు. మత్స్యకారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి వ్యాపార లావాదేవీలు, ప్రస్తుత సదుపాయాలు, మార్కెట్‌లో ఉన్న సమస్యలను ఆరా తీశారు. నిల్వ సదుపాయాలు, పరిశుభ్రత, ధరల నియంత్రణ వంటి అంశాలపై మత్స్యకారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.హుస్నాబాద్ పట్టణంలో త్వరలోనే అత్యాధునిక మోడర్న్ ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఆధు నిక సదుపాయాలతో కూడిన ఈ మార్కెట్ ఏర్పాటైతే మత్స్యకారుల ఆదాయం పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన నాణ్యత గల చేపలు అందుబాటులో ఉంటాయని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

# తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక సమ్మక్క సారక్క జాతర

**- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్, హైదరాబాద్ :**



సమ్మక్క - సారక్క మేడారం జాతర తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ ఉద్ఘాటించారు. యావత్ ప్రపంచం ఈ జాతర కోసం ఎదురు చూస్తుందని పేర్కొన్నారు. ఈ జాతర వేదిక..ప్రపంచం నలుమూలలూ చాటిచెప్పే గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా మేడారం విలసిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మక్క- సారలమ్మ పోరాట గాథ, చరిత్ర విశ్వవ్యాప్తమవుతున్నదని చెప్పారు. సమ్మక్క సారక్క మేడారం జాతరలో అమ్మవారి గద్దెల చుట్టూ భక్తులు క్యూలైన్లలో సాఫీగా వెళ్ళేందుకు తయారు అవుతున్న బ్రాస్ గ్రిల్స్ నమూనాను తెలంగాణ సెక్రటేరియట్‌లో శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ నిర్వాహకులతో స్వయంగా సంభాషించారు. గిరిపుత్రుల ఆరాధ్య దేవతల ఆశీస్సులు తీసుకునేందుకు మొక్కులు చెల్లించుకునేందుకు... ఆ ప్రాంతాన్ని సంద ర్శించి తన్మయత్వం చెంది పునీతులయ్యేందుకు కోట్లలో భక్తులు, ప్రజలు జాతరకు వస్తారని , అందుకు తగిన విధంగా బ్రాస్ గ్రిల్స్ నాణ్యమైనవి ఏర్పాటు చేయాలని సూచన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మేడారంలో పెద్ద ఎత్తున శాశ్వత పనులు చేపడు తున్నామని చెప్పారు. ఆలయ నిర్మాణ సంబంధిత నిర్వాహకులు మంత్రి సురేఖకి గ్రిల్స్ చూపించేందుకు బ్రాస్ గ్రిల్స్ ను స్వయంగా సచివాలయానికి తీసుకొచ్చామని అక్కడే ఎదరైన మీడియా ప్రతినిధులకు చెప్పారు. వాటి ఉపయోగాన్ని మంత్రితోపాటు అక్కడున్న వారందరికీ వివరించారు. దాదాపు రెండు వందల ఏండ్ల పాటు మన్నికగా ఉండే ఉద్దేశంతో ఈ గ్రిల్స్ ను పటిష్టంగా తయారు చేయించినట్టు చెప్పారు. వీటిని సమ్మక్క సారక్క, జంపన్న గద్దెల చుట్టూ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ గ్రిల్స్ ను గద్దెల వద్దనున్న గ్రైనెట్స్ కి సుమారు ఆరు మీటర్ల లోతు దింపి నిలబెడతారని నివేదించారు. అయితే, ఏర్పాట్ల విషయంలో ఏ విధంగానూ రాజీ పడొద్దని మంత్రి సురేఖ చెప్పారు. మేడారం జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం వెళు తుందని, ఈ నేపథ్యంలో మేడారం జాతరలో భక్తుల రద్దీ నిర్వహణను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. జాతరకు మూడు నెలల ముందు నుంచే ఓ పకడ్బందీ ప్రణాళికతో ముందుకు పోతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారిని అభినందించారు.

# ఘనంగా ఉర్దూ టీచర్స్ కాన్ఫరెన్స్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



ఎల్.బీ.నగర్ సమీపంలోని క్రిస్టల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉర్దూ టీచర్స్ కాన్ఫరెన్స్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు ఖ్వాజా ఖుత్బుద్దీన్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ షకీల్ అహ్మ ద్ పర్యవేక్షణ చేశారు. కాన్ఫరెన్స్ కన్వీ నర్‌గా ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ ఖ్వాజా జహీర్‌ఉద్దీన్ వ్యవహ రించారు. కార్యక్రమం ఖురాన్ పఠనం మరియు నాత్ తో ప్రారంభమైంది. అనం తరం ప్రముఖ అతిథులు దీపప్రజ్వలన చేసి కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్సీ శ్రీ పంగలి శ్రీపాల్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ గులాం అఫ్జల్ బియాబాని, మైనారిటీ కమి షన్ ఛైర్మన్ జనాబ్ తారిక్ అన్సారీ, మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బహాదూర్ అలీ, మీర్ కోకబ్ అలీ, డాక్టర్ అనీస్ అహ్మద్ సిద్దిఖీ, ఖ్వాజా నజ్ముద్దీన్ గిలానీ, ముఫ్తీ మిన్హాజ్ అహ్మద్ ఖయ్యూమీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మాట్లాడిన వక్తలు ఉర్దూ భాష కేవలం బోధనా మాధ్యమం మాత్రమే కాకుండా, మన సంస్కృతి, సంప్రదా యాల ఆత్మ అని అన్నారు. తెలంగాణలో ఉర్దూ మీడియం విద్యా సంస్థలను బలపరిచే చర్యలు అవసరమని హితవు పలికారు. ప్రభు త్వానికి విజ్ఞప్తి చేస్తూ, ఉర్దూ పాఠశాలల్లో ఖాళీ ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగాలను త్వరితగతిన భర్తీ చేయాలని, ఆధునిక పాఠ్య పుస్తకాలు, శిక్షణ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ఉపాధ్యాయులు తమ సమస్యలు, సూచనలు తెలియజేశారు. ఉర్దూ విద్యా అభివృద్ధి కోసం పలు కార్యచరణలు సూచించారు. కార్యక్రమ నిర్వాహకులుగా మొహమ్మద్ ఖ్వాజా ముహైమినుద్దీన్ మరియు సయ్యద్ ఖ్వాజా ఫరీదుద్దీన్ బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తించారు. ముగింపు సమయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఖ్వాజాఖుత్బు ద్దీన్ అన్ని అతిథులకు, ఉపాధ్యాయులకు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలి యజేస్తూ, ఉర్దూ టీచర్స్అసోసియేషన్ కార్యకలాపాలను మరింత శక్తివంతంగా కొనసాగి సామని తెలిపారు.

# టీటీడీకి ఎలక్ట్రిక్ బస్సు విరాళం

**వేద న్యూస్, తిరుమల :**

పూణేకు చెందిన పినాకిల్ మొబిలిటి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.74.24 లక్షల విలువైన విద్యుత్ బస్సును శనివారం టీటీడీకి విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయం ఎదుట బస్సు తాళాలను డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల ట్రాన్స్ పోర్ట్ డిఐ శ్రీ వెంకటాద్రి నాయుడు పాల్గొన్నారు. టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే జారీ చేయబడింది.



## టెక్నికల్ ఫాల్ట్‌తో గ్రాండ్ విటారా రీకాల్

**వేద న్యూస్ డెస్క్:**



ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి గ్రాండ్ విటారా కార్లను వెనక్కి పిలిచింది. గతేడాది డిసెంబర్ 9 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 29 మధ్య తయారైన గ్రాండ్ విటారా మోడల్స్‌ను రీకాల్ చేసింది. ఫ్యూయల్ లెవల్ ఇండికేటర్, వార్నింగ్ లైట్ పని చేయకపోవడం వంటివి గుర్తించామని కంపెనీ పేర్కొంది. ఈ ఫీచర్స్ సహాయంతో సహాయంతో ట్యాంక్‌లో ఎంత ఇంధనం తెలుసుకునే అవకాశం ఉంటుంది. సరిగా పని చేయకపోవడంతో డ్రైవర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చే ఆస్కారం ఉంటుందని కంపెనీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సమస్య నేపథ్యంలో 39, 506 యూనిట్లను రీకాల్ జాబితాలో చేర్చించింది. ఆయా కార్ల య జమానులను సంప్రదిస్తామని మారుతి సుజుకి తెలిపింది. కార్ తనిఖీ కోసం అధీ కృత సర్వీస్ సెంటర్‌కు వెళ్లాలని కంపెనీ పేర్కొంది. స్పీడోమీటర్ అసెంబ్లీలో లోపం గుర్తిస్తే.. వెహికిల్ వారంటీ గడువు ముగిసినా కంపెనీ ఆ భాగాన్ని ఉచితంగానే రీప్లేస్ చేయనున్నట్లు కంపెనీ పేర్కొంది.ముందు జాగ్రత్త చర్యగా రీకాల్ చేస్తున్నామని.. సుంరక్షితమైన డ్రైవింగ్‌ను నిర్ధారించేందుకు వినియోగదారులు వెంటనే స్పందించాలని సూచించింది. ఇదిలా ఉండగా.. గ్రాండ్ విటారా ఎక్స్‌షోరూం ధర రూ. 10.77లక్షల నుంచి రూ. 19.72లక్షల వరకు ఉంటుంది. ఇది ప్రీమియం ఎస్‌యూవీ. గ్రాండ్ విటారా ఎస్‌యూవీ రెండు ఇంజిన్ ఆప్షన్ అందుబాటులో ఉన్నది. 1.5-లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజన్ 101.5 బీహెచ్‌పీ, 137 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ ఇంజిన్ 5-స్పీడ్ మాన్యువల్, 6-స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఆప్షన్స్‌లో లభిస్తుంది. కొన్ని వేరియంట్లలో ఆల్‌గ్రిప్ ఆల్-వీల్ డ్రైవ్ సిస్టమ్ సైతం ఉంది. 1.5-లీటర్ హైబ్రిడ్ ఇంజిన్.. హైబ్రిడ్ పవర్ ట్రెయిన్‌లో పెట్రోల్ ఇంజిన్ 90 బీహెచ్‌పీ, 122 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. అయితే, ఎలక్ట్రిక్ మోటార్ 79 బీహెచ్‌పీ, 141 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. హైబ్రిడ్ ఇంజిన్ ఎస్‌యూవీ గరిష్టంగా 27.11 కిలోమీటర్లు వస్తుంది. పెట్రోల్ మాన్యువల్ 21.11 కిలోమీటర్లు, పెట్రోల్ ఆటోమేటిక్ 20.58, ఆల్ గ్రిప్ ఏడబ్ల్యూడీ వేరింట్ 19.20 కిలోమీటర్లు వస్తుంది.

## నకిలీ వెబ్‌సైట్లతో జాగ్రత్త ఎస్బీఐ కార్డ్

**వేద న్యూస్ డెస్క్:**




అన్ని రకాల ఆర్థిక లావాదేవీలలో అప్ర మత్తంగా ఉండాలని ఎస్బీఐ కార్డ్ సూచించింది. అదే విదంగా ధైర్యంగా, భద్రంగా షాపింగ్ చేయడానికి కొన్ని ముఖ్యమైన భద్రతా సూచనలను తప్ప నిసరిగా అనుస రించాలని సూచించింది. అంతర్జాతీయ మోసాల అవగాహనా వారోత్సవం సంద ర్భంగా ఎస్బీఐ కార్డ్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఎప్పుడూ అధికారిక బ్రాండ్ వెబ్‌సైట్లు లేదా విశ్వస నీయమైన మార్కెట్‌ప్లేస్‌లలో మాత్రమే కొనుగోలు చేయాలని వినియోగదారులకు సూచించింది.. సోషల్ మీడియా లేదా మెసేజింగ్ యాప్‌ల ద్వారా వచ్చే నకిలీ వెబ్‌సైట్ల ర్యాండమ్ లింకులు లేదా అటాచ్మెంట్‌లపై క్లిక్ చేయవద్దని హెచ్చరించింది. లేదంటే అవి డిజిటల్ మోసాలకు ప్రధాన ద్వారాలుగా ఉపయోగించబడతాయని పేర్కొంది. సెప్టెంబర్ 2025లో ఈ-కామర్స్ మొత్తం విక్రయాల్లో 66.4 శాతం వాటా క్రెడిట్ కార్డులదేనని గుర్తు చేసింది. డిజిటల్ చెల్లింపు పద్ధతుల వినియోగం పెరుగుతున్న తరుణంలో, వినియోగదారులు ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండటం, అందుబాటులో ఉన్న ఆఫర్లు, డీల్స్‌ను తెలివిగా వినియోగించుకోవాలని సూచించింది.

# కాంగ్రెస్‌ను ఎవరూ కాపాడలేరు..!

- సూరత్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- బీహార్ ఎన్నికలు కులతత్వ విషాన్ని తిరస్కరించాయని ప్రధాని ప్రసంగం
- ప్రతిపక్షాలపై మోదీ ధ్వజమెత్తి, బీహార్ ప్రజల రాజకీయ చైతన్యాన్ని ప్రశంస

**వేద న్యూస్, డెస్క్:**



సూరత్‌లో జరిగిన భారీ ప్రజాసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీహార్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. బీహార్ ప్రజలు కులతత్వ రాజకీయాలను పూర్తిగా తిరస్కరించారని, అభివృద్ధి ఎజెండాకే ప్రాధాన్యత ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. సూరత్‌లో నివసిస్తున్న బీహార్ వలస కార్మికులను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ, "బీహారీలను కలవకుండా సూరత్‌ను వదిలి వెళ్తే నా ప్రయాణం అసంపూర్తిగా ఉంటుంది" అని అన్నారు. బీహార్ ప్రజలు దేశానికి రాజకీయాలు నేర్పే స్థాయిలో ఉన్నారని ఆయన ప్రశంసించారు. బీహార్ ఎన్నికల్లో కుల ఆధారిత ప్రచారం చేసిన నాయకులను ప్రధాని తీవ్రంగా విమర్శించారు. రెండు సంవత్సరాలుగా కొన్ని "బెయిలబుల్ నాయకులు" బీహార్‌లో కులతత్వాన్ని రెచ్చగొట్టడానికి యత్నించారని, కానీ ప్రజలు అభివృద్ధి పథకాలను మద్దతు ఇస్తూ ఆ రాజకీయాలను తిరస్కరించారని మోదీ అన్నారు. కూటమికి వచ్చిన విస్తృత ఆధిక్యం ప్రజల్లో ఉన్న అభివృద్ధి నమ్మకాన్ని సూచిస్తుందని, 10 శాతం ఓట్ల తేడా బీహార్ ఓటర్ల ఏకగ్రీవ అభిప్రాయానికి నిదర్శనం అని వ్యాఖ్యానించారు. యువత, మహిళలు ప్రతిపక్షానికి సరైన "రిప్లై" ఇచ్చారని కూడా మోదీ అన్నారు. ఈ సందర్భంగా మోదీ వక్ఫ్ చట్టం అంశాన్ని ప్రస్తావించారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో, ముఖ్యంగా తమిళనాడులో అక్రమంగా ఇళ్లను, గ్రామాలను వక్ఫ్ ఆస్తులుగా మార్చారని ఆరోపించారు. ఈ అక్రమాలను అరికట్టేందుకు కొత్త వక్ఫ్ చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టామని ఆయన తెలిపారు. బీహార్ ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు ఈ చట్టాన్ని అమలు చేయమని ప్రకటించడం మత రాజకీయాలకు నిదర్శనమని మోదీ విమర్శించారు. బీహార్ ప్రజలు ఈ మతాధారిత రాజకీయాలను కూడా తిరస్కరించారని ఆయన అన్నారు. ప్రసంగం చివరలో కాంగ్రెస్‌పై ప్రధానమంత్రి హార్ష్‌గా స్పందించారు. "కాంగ్రెస్‌ను ఇక ఎవరూ కాపాడలేరు" అని మోదీ స్పష్టం చేశారు. దేశం కాంగ్రెస్ విధానాలపై అసంతృప్తిగా ఉందని, ముస్లిం లీగ్-మావోయిస్ట్ కాంగ్రెస్‌కు ప్రజలు పూర్తిగా నో చెప్పారని పేర్కొన్నారు. బీహార్ ఫలితాలు ప్రతిపక్షాలకు పెద్ద చెక్ అని, దేశం ఇప్పుడు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సూరత్‌లో బీహార్ వలస కార్మికులు ఆయనకు ఇచ్చిన ఆతిథ్యం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ఘనంగా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి

- నివాళులర్పించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఘనంగా పార్లమెంట్ భవన్‌లో పుష్పాంజలి
- 2021 నుంచి దేశవ్యాప్తంగా 'జనజాతి గౌరవ దివస్'గా నిర్వహణ
- గిరిజన సమాజానికి మహనీయ నాయకుడిగా బిర్సా ముండా స్మరణ

**వేద న్యూస్, డెస్క్:**



భారత గిరిజన సమాజానికి స్ఫూర్తిదాయక నేతగా నిలిచిన భగవాన్ బిర్సా ముండా 150వ జన్మ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ భవన్‌లో పుష్పాంజలి ఘనంగా నివాళులు అర్పించారు. ముఖ్య నేతలు, పార్లమెంట్ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2021 నుంచి బిర్సా ముండా జయంతిని దేశవ్యాప్తంగా జనజాతి గౌరవ దివస్గా జరుపుతున్న సందర్భంగా ఈ స్మారక కార్యక్రమం నిర్వహించబడింది. ఆయన చేసిన త్యాగాలు, ఉద్యమాలు భారత గిరిజనుల హక్కుల సాధనలో కీలక మైలురాళ్లుగా నిలిచాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. తన త్యాగం, నాయకత్వం, స్వాభిమాన పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, రాబోయే తరాలకు కూడా బిర్సా ముండా జీవితం స్ఫూర్తి నింపుతుందన్నారు.

# రెండో రోజు ముగిసిన ఆట

**వేద న్యూస్ డెస్క్:**




కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా భారత్-సౌతాఫ్రికా జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ రసవత్తరంగా కొనసాగుతోంది. బ్యాటింగ్‌లో నిరాశపర్చిన టీమిండియా బౌలింగ్‌లో అదరగొడుతుంది. భారత స్పిన్నర్ల ధాటికి సఫారీ సేన బ్యాటర్లు వరుసగా పెవిలియన్ బాట పట్టారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా ఏడు వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. దీంతో భారత్‌పై 63 పరుగుల ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. కోర్బిన్ బాష్(1), టెంబా బావుమా(29) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా విజృంభించాడు. ఏకంగా నాలుగు వికెట్లు తీసుకొని 28 పరుగుల మాత్రమే ఇచ్చాడు. కుల్దీప్ యాదవ్ 2, అక్షర్ పటేల్ ఓ వికెట్ పడగొట్టారు.ఓవర్‌నైట్ 37/1తో రెండో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియా ఘోరంగా విఫలమైంది. సఫారీ బౌలర్ల ధాటికి బ్యాటర్లు చేతులెత్తేశారు. దీంతో 189 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(39) టాప్ స్కోరర్. వాషింగ్టన్ సుందర్(29), రిషభ్ పంత్(27), రవీంద్ర జడేజా(27) పర్వాలేదనిపించారు. బ్యాటింగ్ చేస్తుండగా మెడ పట్టేయడంతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్(4లి) రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు. సౌతాఫ్రికా బౌలర్లలో సైమన్ హర్మర్(4/30), మార్కో యాన్సెన్(3/35) రాణించారు. దీంతో భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల ఆధిక్యం లభించింది.

## సీఎస్కేకి వెళ్లడంపై స్పందించిన సంజూ

**వేద న్యూస్ డెస్క్:**




ఐపీఎల్ 2026 సందడి ఇప్పటికే మొదలైంది. ఈ సీజన్‌లో అందరి దృష్టి రవీంద్ర జడేజా-సంజూ శాంసన్ ట్రేడ్ డీల్‌పైనే ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు జడేజాను వదిలి.. సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ ట్రేడ్ డీల్‌లో భాగంగా జడేజాను రాజస్థాన్ రాయల్స్ రూ. 14కోట్లకు సొంతం చేసుకోగా.. సంజూ ఐపీఎల్ వేతనం రూ. 18కోట్లకే సీఎస్కే తీసుకుంది. రాజస్థాన్ రాయల్స్‌కు కెప్టెన్‌గా ఉండే సంజూ.. ఉన్నట్టుండి జట్టు మారడంపై అభిమానులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విషయంపై సంజూ సోషల్ మీడియా వేదికగా స్పందించాడు.సమయం వచ్చింది.."మనం ఈ ప్రపంచంలో కొన్నాళ్ల పాటే ఉంటాం. రాజస్థాన్ రాయల్స్ కోసం నా సర్వస్వం ధారబోశాను. ఆటను గొప్పగా ఆస్వాదించాను. జీవితానికి సరిపడా జ్ఞాపకాలను, బంధాలను పోగు చేసుకున్నాను. ఫ్రాంచైజీలో ప్రతి ఒక్కరినీ నా కుటుంబ సభ్యుడిగానే భావించాను.

# మహేశ్ భావోద్వేగ పోస్టు

- తండ్రిని గుర్తుచేసుకున్న మహేశ్






**వేద న్యూస్ డెస్క్:**

సూపర్ స్టార్ మహేశ్ బాబు తన తండ్రి, దివంగత సూపర్ స్టార్ కృష్ణని తలచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈరోజు ఆయన నటించిన గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగబోతుండగా.. తన తండ్రిని గుర్తు చేసుకుంటూ మహేశ్ బాబు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మహేశ్ బాబు, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రాబోయే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి ఈరోజు సాయంత్రం గ్లోబ్ ట్రాటర్ అనే పేరుతో భారీ ఈవెంట్ జరుగబోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ వేడుకలో తన తండ్రిని మిస్ అవుతున్న మహేశ్ బాబు ఆయనను గుర్తుచేసుకుంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు.మహేశ్ ఎక్స్ వేదికగా రాసుకోస్తూ.. ఈరోజు మిమ్మల్ని నేను కాస్త ఎక్కువగా గుర్తు చేసుకుంటున్నాను నాన్న మీరు గర్వపడతారని నాకు తెలుసు నాన్న అంటూ మహేశ్ బాబు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశాడు. దీనికి కృష్ణతో దిగిన ఒక ఫొటోను షేర్ చేశాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటో వైరల్‌గా మారింది.